


నేను ఆ థర్మల్ పవర్ స్టేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా ... ఆ అరణ్యం నడుమ జీవితాన్ని గడుపబట్టి రెండు సంవత్సరాలైంది. మొదట్లో ప్రభుత్వం ఆ ప్రాజెక్ట్ కార్యభారాన్ని నాకు వప్పజెప్పి అక్కడికి పంపినపుడు దట్టమైన అడవీ, దూరంగా సువిశాలమైన నదీపాయ తప్పితే ఏదీ కనిపించేది కాదు. చుట్టూ కొండలే నేస్తాలు. ఆ ఏడాదంతా వేలమంది కూలీలు నా సహచరులు .... కొద్దిమంది ఇంజనీరింగ్ స్టాఫ్, మినిస్టీరియల్ సిబ్బంది పాలనా విభాగంలో నాతోపాటు ఉండేవారు. సరియైన ఇండ్లుగానీ, వసతిసౌకర్యాలు గానీ ఉండేవికావు. ఎక్కడున్నామన్న ధ్యాస ఉండేదికాదసలు. ... ఎప్పుడు ప్లాంట్ తయారవుతుందా ... ఎప్పుడు కమీషనింగై విద్యుత్తు ఉత్పత్తి మొదలవుతుందా అన్నదే ధ్యాస - రాత్రింబవళ్ళు తపస్సు.

దినంలో ఎక్కువభాగం వందల వేల సంఖ్యలో దీక్షతో పని చేసే కూలీలమధ్య గడిపేవాడ్ని. హడావిడితో, ఎంతో చురుకుదనంతో, చకచకా జరిగే ఆ పని జరుగుతున్న చోట ఉంటే ఎంతో తృప్తిగా ఉండేది. ముఖ్యంగా బాయిలర్ ఎరక్షన్, చిమ్నీ ఇన్‌స్టలేషన్, కూలింగ్ టవర్ నిర్మాణం యిలాంటివి జరుగుతున్నప్పుడు ఎంతో సరదాగా ఆ

త్తయిన కట్టడాల్లో ఓ కుర్చీ వేసుకుని స్వయంగా పనిని గమనించే డిని.

ఆ పరంపరలో –

మొదటి కూలింగ్ టవర్ నిర్మాణం జరుగుతూండగా,

దాదాపు 50 మీటర్ల ఎత్తున ... ఫైనల్ కాంక్రీట్ స్లాబింగ్ స్తున్నారు. నేను ఓ చోట లిఫ్ట్‌లో నిలబడి చుట్టూ చూస్తున్నాను.

కాంక్రీట్ తట్టలను కూలీలు చకచకా అందిస్తున్నారు ఒకరి ంండి ఒకరికి. గ్యాప్ ఎక్కువగా ఉన్నచోట తట్టలను నెత్తిపై పెట్టుకుని అంత ఎత్తున నెమ్మదిగా వెదురు వంతెనలపై నడుస్తున్నారు.

— అప్పుడు చూశానామెను.

పాపం నిండు చూలాల్లా ఉంది. ఎంతో భారంగా నెత్తిపై కట్టను ... కడుపులో పాపను ... మోస్తూ, భారంగా అడుగులో అడుగేసుకుంటూ,

ఆమె వెనుక ఓ పన్నెండేళ్ళుకూడా నిండని ఓ బాలుడు.

వాడుకూడా నెత్తిపై తట్టతో రథాన్ని లాక్కెళ్ళుతున్న ఒంటరి గుర్రంలా –

మనసు చివుక్కుమంది.

ఆమెనేమో పూర్తిగా దయనీయమైన స్థితిలో – వాడేమో బాల కార్మికుడు ... హృదయాన్ని ఎవరో పిడికిట్లో పిసికినట్టనిపించి –

కంట్రాక్టర్‌ను పిలిపించాను. అడిగితే,

ఆమెపేరు లక్ష్మి అని చెప్పాడు. భర్త ఓ పెద్ద తాగుబోతు. వీళ్ళు ఏంజేస్తారన్నది వాడికనవసరం. కావలసిందల్లా వాడికి ఈమె రోజూ పది రూపాయలీయడం. లేకుంటే గొడ్డుదెబ్బలు తినడం. ఆమె వెనుక ఉన్నది ఆమెకొడుకు బీక్యారాం. వాడిని కొండంత ఆశతో బళ్ళో చదివిస్తోందామె. ఎనిమిదోక్లాసు. ప్రస్తుతం వేసవి సెలవులు కాబట్టి వాడుకూడా అమ్మతో కూలీకొచ్చాడు. సంక్షిప్తంగా అదీ కథ.

"కాని ఆమె పాపం ఆ స్థితిలో ఇంత ఎత్తున పనిచేయడం బాగు లేదయ్యా ... మరీ పాశవికంగా ఉంది... " అని అంటున్నాన్నేను, .... ఇంతలో

"అ....మ్మామ్మామ్మా..." అని ప్రకృతి అదిరిపోయే కేక గాలినిండా అలుక్కుపోయి,

ఉలిక్కిపడ్డాను....

ఆమే...లక్ష్మి...వెదురువంతెన పైనుండి జారి నెత్తిపైనున్న తటతోసహా పడిపోయి...చూస్తూండగానే కట్టబడ్డ అనేక వెదురు స్ట్రక్చర్ అడ్డంకులను తట్టుకుంటూ, చిందరవందరై పోతూ – చటుక్కున నేలపై కూలిపోయింది.

ఆ దృశ్యం చూస్తూనే ..."అమ్మా ..."అన్న ఆమె కొడుకు బీక్యారాం గుండెలదిరిపోయే పిలుపు.

ప్రకృతి స్తంభించి...ఎక్కడివాళ్ళక్కడే శిలలై...భయం... భయం...ఎటుచూసినా భయం.

హృదయం విదారకమైపోయింది,.

కళ్ళనిండా నీళ్ళు...తత్తర...దోషిలా,... ఆ ప్రాజెక్ట్‌కు నేనే అధిపతినికాబట్టి – ఆమెను నేనే చంపించినట్టు భావన.

ఆ రాత్రి...నిద్రలేదు...చెవుల్లో ఆమెయొక్క మృత్యుకేకే ...పిల్లవాని పిలుపే.

ఏంచేయాలి...

ఆ పిల్లవాడేంకావాలి...వాడికిప్పుడెవరు దిక్కు – ఘర్షణ.... ఆమె కుటుంబానికెలా న్యాయం చేయాలి... ఆమె ఓ కాంట్రాక్టర్ క్రింద కూలీ. ప్రభుత్వానికి సంబంధంలేనిది –

ఐనా ... ఏదో ఓ విధంగా రెండువేల రూపాయలు ఆమె తరఫున బీక్యారాంకు అందేట్టు చేయగలిగేను.

తర్వాత మళ్ళీ పని ...

కాలం గడుస్తూండడం –

ఈలోగా ఛీఫ్ ఇంజనీర్‌గా ప్రమోషన్ రావడం, హైద్రాబాద్ మారడం జరిగి, మామూలు జీవన ప్రవాహంలో పడిపోయాను.

* * *

ఈరోజు – అదే థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎవరో మంత్రి భారతజాతికి అంకిత మిస్తూంటే వెంట ఉంటూ నేనుకూడా వచ్చి – జ్ఞాపకాలు ...

రెండేళ్ళ సుదీర్ఘమైన జ్ఞాపకాలు.

మేం కూర్చున్న కారు అందంగా అలంకరించిన వేదిక వద్దకు చేరుకుంది. దిగగానే చుట్టూ ఎందరో ఆఫీషియల్స్. ఎస్. ఇ. లు, ఇ. ఇ. లు, డి. ఇ. లు, ఎ. ఇ. లు. – అన్నీ వెకిలి నవ్వులు. మస్కా నమస్కారాలు.

ప్రభుత్వ రంగంలో పవర్‌లో ఉన్న వాడికి చుట్టూ ఉన్న మనుషులు భరించలేని స్థాయిలో స్తుతి కొడుతూంటారు. దాన్ని తల వంచి సహించక తప్పదు.

మంత్రిగారు త్వరత్వరగా స్టేషన్‌ను కమీషన్ చేసేందుకు ఏర్పాటుచేసిన స్విచ్‌ను ఆన్ చేసి వెళ్ళిపోయేందుకు హడావుడి పడిపోతున్నారు.

కాని - కమీషనింగ్‌కన్నా ముందు, ఆ పవర్ స్టేషన్ నిర్మాణంతో నాకున్న అవినాభావ సంబంధాన్ని పురస్కరించుకొని నాతో ఓ చిన్న కార్యక్రమం ఏర్పాటు చేశారు. అది ... స్టేషన్ మెషినరీ ఎరక్షన్‌లో ఉండగా, డ్యూటీలోనే గుండె ఆగి చనిపోయిన డివిజనల్ ఇంజనీర్ శ్రీ ఎ. రామశాస్త్రిని "కర్తవ్య నిర్వహణలో కన్నుమూసిన అమర జీవి" గా ఓ పాలరాతి ఫలకంపై స్థూపానికి నిర్మింపజేసిన స్మారక చిహ్నాన్ని నేను ఆవిష్కరించడం.

సరే... మురా అంతా ఆ స్థూపంవేపు కదిలింది.

కార్లు దిగి...కరకరలాడే బట్టలు ... ఆంగ్ల సంభాషణలు ... సకిలింతలు ...

స్టేషన్ ఇంజనీర్ స్వాగతవచనాలు –

వేదిక అలంకరణలు –

స్మారక చిహ్నావిష్కరణ కాబట్టి ... కాస్త మౌన గంభీర వాతావరణం ఏర్పడింది.

నడుస్తున్నాను స్థూపందిక్కు .... ముందు నా పి. ఎ. దారి తీస్తున్నాడు.

పాలరాతి ఫలకంపై ఏర్పాటుచేసిన సిల్కు పరదాను తొలగించేందుకు సిల్కుదారాల కుచ్చులను లాగబోతూండగా ...

"ఢన్ ..." మని ఓ కాగితపు ఉండ ఫట్‌మని ఇ గుండులా దూసుకొచ్చి - స్థూపాన్నితాకి క్రిందపడి –

వందల, వేల తలలు చటుక్కున వెనక్కితిరిగి,

"పక్‌డో .... పక్‌డో" అరుస్తోందొక ఖాకీ డ్రెస్.

పోలీసుమంద పరుగులు తీస్తోంది.

అంతా నిశ్శబ్దం ... ప్రపంచం బ్రద్దలైపోయినట్టు బాధ.

పిల్లవాడు పరిగెత్తుతున్నాడు ... మెరుపులా ... వాణ్ణి....

వాణ్ణి ఎక్కడో చూచినట్టు గుర్తు...ఎక్కడ....ఎక్కడ !

వంగి కాగితపు ఉండను ముట్టుకోబోతూంటే – "ఆగండిసార్. అది బాంబేమో ..." అంది మరో పోలీస్ కంఠం.

తలెత్తి అతనివంక చూచి ... నవ్వి ... విచ్చుకున్న కాగిత ఉండను చేతుల్లోకి తీసుకుని – విప్పి.

"ఈ నిర్మాణంలో – ఈ దేశంకోసం అసువులు బాసిన మ అమ్మ లక్ష్మి .... కూలీ లక్ష్మి అమరజీవికాదా .... ఎక్కడుంది ఆ స్మారకచిహ్నం – బీక్యారాం."

సిగ్గు .... తలలో, మనసులో ... అణువణువునా సిగ్గు –

"శహరో ... ఆ పిల్లవాడ్ని ఏమీ అనకండి. తీసుకురండిక్కడి ...." అరిచాను.

కూలీ లక్ష్మి పేరు రాయించాలి స్థూపంపై. లేకుంటే నేన మనిషిని కాను –

గుండెల్లో ఏదో ఉద్వేగం .... !

